# సమాన హక్కు



దుగ్గరాజు నాగేశ్వరరావు

సాయంకాలం ఐదు గంటలకు ఇంటికి వచ్చిన సుబ్బారావ్‌ని వాకిటికి వేసి ఉన్న తాళం కప్ప ఎక్కిరించింది. ఎంత ఆనందంగా వచ్చాడో అంత నీరసించాడు. మొహం మూడు రంగులుగా మారింది. ముందు కోపం తరువాత నవ్వు ఒకసారిగా వచ్చాయి.

ఇంతలో పనిమనిషి పిలిచిన పిలుపుకు వెనక్కి తిరిగాడు.

''అయ్యగారు. అమ్మగారు ఏడో పనుందని వెళ్ళారు. ఇంద తాళం చెయి. నేను వెళుతుండా నయ్యా.''

''సరేలే''. తాళం చేతులు తీసికొని అన్నాడు.

ఎక్కడికి వెళ్ళి వుంటుంది శ్రీమతి. ఆయినా నాకు చెప్పకుండా రోజు సాయంకాలం ఎదురువచ్చి స్వాగతం ఇచ్చే శ్రీమతి ఇవాళ ఎక్కడికి వెళ్ళుంటుందబ్బా! మనసు రైలు లాగా పరిగెడుతుంది. కాని స్టేషన్లు తగలటం లేదు. అంటే ఎక్కడికి వెళ్ళిందో మనసుకి తగలటం లేదు. ఆలోచిస్తూనే తలుపు తాళం తీసాడు సుబ్బారావ్.

గబగబా వంటయింట్లోకి వెళ్ళాడు. ఫ్లాస్కో కనిపించింది. ఫ్లాస్కోలో కాఫీ గ్లాసులోకి వంపుకొని వచ్చి బల్లముందు కూర్చున్నాడు సుబ్బారావ్. కాని మనసు మనసులో లేదు. చేతులూరు కోక సొరుగు లాగాడు. అందులో ఎప్పుడో పంచిపెట్టగా మిగిలిన కాయితాల కట్ట కనిపించింది. అందులోంచి ఒక కాయితం తీసి చదవటం మొదలు పెట్టాడు.

'మహిళా మండలి' (పెద్ద అక్షరాలతో) క్రింద — భర్తలు, భార్యలకు చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను అరికట్టటానికి నిరసనగా ఈరోజు (17.12.77) పెద్ద ఊరేగింపుతో సాయంకాలం ఐదు గంటలకి మహిళా మండలి నుండి బయలుదేరి మెయిన్ రోడ్డులు తిరిగి మరలా మహిళా మండలిని చేరాలి. ఈ ఊరేగింపులో మహిళలందరూ పాల్గొన వలసినదిగా ప్రార్థన.

ఇట్లు, కార్యదర్శిని.

అనుమానంవేసింది. ఇవాళ తారీకు ఎంత. ఎదురుగా గోడకి ఉన్న కాలెండర్‌ని చూశాడు. అవును ఈరోజు 17వ తారీకు. అక్కడికే వెళ్ళి ఉంటుంది అనుకున్నాడు సుబ్బారావ్.

''మహిళా మండలి నుండి బయలుదేరి మెయిన్ రోడ్లు తిరిగి...ఆఁ ఇహ వీళ్ళు కొంపకి చేరినట్లే. మెయిన్ రోడ్డంటే ఎంతో రెష్. అందులో సాయంకాలం పూట ఇంకా ఎక్కువ. తెల్లవారే సరికి చేరినా చేరినట్లే ఇళ్ళకి.'' ముందు కోషం వచ్చింది శ్రీమతి మీద సుబ్బారావ్‌కి.

''ఎన్నిసార్లు చెప్పినా ఇదే పంతం. దాన్ని వదిలిపెట్టదే. ఏమిటో పంతాలు. కొంచెం కూడ బుర్ర ఉపయోగం ఉండదు'' అనుకున్నాడు బాధగా.

తరువాత స్నానం చేసి నవల చేతబూని మంచం మీదికి వరిగాడు సుబ్బారావ్. నవల పూర్తయ్యే సరికి ఎనిమిది కావస్తుంది. తరువాత భోంచేసి నిద్రలోకి జారుకున్నాడు.

నిద్రలో సుబ్బారావ్‌కి పిలుపు, చప్పిడి విని పించాయి కలలో అనుకున్నాడు. భయంగా నిద్రలోంచి లేచి కళ్ళు నలుపుకుంటూ, ''అబ్బబ్బా వస్తున్నా ...'' అంటూ వెళ్ళి తలుపు తీసాడు. ఎదురుగా శ్రీమతి ప్రత్యక్షం.

''అబ్బబ్బా ఈ రోజు నా కాళ్ళు విపరీతంగా నొప్పి పుడుతున్నాయి బాబు'' అంటూ వెళ్ళి మంచం మీద వ్రాలింది శ్రీమతి.

గడియారం చూశాడు సుబ్బారావ్. పదకొండు గంటలైంది.

''పదకొండు గంటలదాకా తిరిగితే కాళ్ళు నొప్పులు పుట్టవూ. అయినా నేను చెబితే వింటావా ?''

''ఏమిటండీ వినేది ! ? స్త్రీలంటే నీచంగా చూసే పురుషుల కూపం నుంచి స్త్రీలను రక్షించాలనే మా తాపత్రయం.''

''పురుషులంటే కూడ స్త్రీలు అలానే చూస్తున్నారు కొంతమంది. మరి వారినేమంటావ్'' అడిగాడు గట్టిగా.

''ఎవరండీ అలాంటివాళ్ళను ఎక్కడన్నా చూపించండి ?''

''ఎక్కడో ఎందుకు నువ్వే !''

''నేనా... ?''

''ఆఁ కాదా ! ? అర్ధరాత్రి దాకా నువ్వు తిరిగి రావచ్చు కాని, మగవాడు తిరిగితే తప్పవడతావా ?''

''నేనేం తిరగటానికి వెళ్ళలేదు. ఊరేగింపుకు వెళ్ళాను. తెలుసా ?''

''తెలుసు. కాని మగవాడికి మాత్రం అర్ధరాత్రిదాక తిరగటానికి అవసరాలే ఉండవు పాపం...''

''ఉండొచ్చు. కాని కొంతమంది చెడు తిరుగుళ్ళకు అలవాటు పడి, ఇంట్లో స్త్రీలను బాధిస్తున్నారు. అలాంటివాళ్ళ చేతులనుండి స్త్రీలను విముక్తి చేయాలి. అదే మా సంకల్పం'' అంది గర్వంగా.

''సరే నీ ఏడుపు నువ్వే ఏడువ్'' అన్నాడు సుబ్బారావ్ కోపంగా.

''అలాగేలేండి పెద్ద చెప్పొచ్చారు'' అంది ముసుకు తంతూ.

''అదేమిటి అన్నం తినవా ?''

''తినే వచ్చానండి'' అన్నది శ్రీమతి ముసుకు తీయకుండానే.

''అదా సంగతి!'' అంటూ లైటాపి, ''అవతలికి జరుగు'' అంటూ శ్రీమతి ప్రక్కన చోటు చేసుకున్నాడు సుబ్బారావ్.

*   *   *

అది ఒక నగరం. ఆ నగరంలో సుబ్బారావ్‌కి సొంత ఇల్లుంది. అది మూడు పోర్షన్లు. వాళ్ళ నాన్నగారు చనిపోతూ ఒక్కగానొక్క కొడుకు ఐన సుబ్బారావ్‌కి ఆ ఇల్లు యిచ్చిపోయాడు. పోయేముందు శ్రీమతికి సుబ్బారావ్‌కి పెళ్ళి చేసిపోయాడు. ఇప్పుడు శ్రీమతి, సుబ్బారావ్ భార్యాభర్తలు. అన్ని విషయాలు ఏకీభావంతో వెళ్ళిపోతాయి కాని ఒక విషయంలో మాత్రం బద్ధ విరుద్ధంగా ఉంటారు. ఒకళ్ళు అది తూర్పు అంటే ఇంకొకళ్ళు కాదు అది పడమర అంటారు.

ఆ విషయం చర్చలోకి వస్తేనే విరుద్ధంగా మాట్లాడుకుంటారు. ఆ టాపిక్కు ఐపోగానే మళ్ళీ కలిసిపోతారు. పెళ్ళై నాలుగేళ్ళయినా ఆ విషయంలో మాత్రం ఏకం కాలేకపోయారు.

శ్రీమతిది మొండి పట్టుదల. తను అన్నది నిజం అంటుంది. సుబ్బారావ్ మాత్రం కొంచెం సేపు ఆలోచించిగాని ఏ విషయం మాట్లాడడు.

మగవాళ్ళు స్త్రీలంటే అసహ్యంగా చూస్తారని అదీ కట్టుకున్న పెళ్ళాన్ని, కుక్క కన్నా హీనంగా ఉంటుందని, తమకు సేవలు చేయించుకోటానికే



లింటాస్-BBC DLT.2-203 TL

పెళ్ళి చేసుకుంటారని, స్త్రీ జాతికే ఇది ఎంతో అవమానకరమని శ్రీమతి అభిప్రాయం. ఈ అభిప్రాయంతో సుబ్బారావ్ **కూడ** ఏకీభవించాడు. కానీ పురుషులంటే కూడ విలువ ఇవ్వని స్త్రీలు కూడ ఉన్నారు. వాళ్ళకి వచ్చిన జీతం మొత్తం ఇవ్వాలి. కానీ పైసా కూడ తిరిగి భర్తకి ఇవ్వరు. భర్తను కుక్కిన పేనులాగ చూసే భార్యలు ఉన్నారు. అంటాడు సుబ్బారావ్.

ఇద్దరివైపూ రెండు రకాలవాళ్ళు ఉన్నారు కాబట్టి వాళ్ళకోసం మనం పోట్లాడుకోనక్కర లేదు. సమాన హక్కులని ఎగబడనక్కరలేదని సుబ్బారావ్ శ్రీమతితో చాలసార్లు చెప్పాడు. కానీ ఈ విషయంపై ఇంకా ఏకీభావం రాలేదు. ఎప్పటికి వస్తుందో...

* * *

"ఏమేవ్ మన రెండు పోర్షన్లు ఖాళీగా ఉన్నాయని గొడవ చేస్తుంటివిగా. ఈ రోజు రాత్రికి రెండు వాటాల్లోకీ వస్తున్నారు. ఒక వాటాలోకి మా ఆఫీసులోనే నాతో పనిచేస్తున్న గోపాలం వస్తున్నాడు. రెండో వాటాలోకి ఎవరో క్రొత్తగా కాకినాడ నుండి వస్తాడట ఎల్. ఐ. సిలో పనట. ఇద్దరూ క్రొత్తగా పెళ్ళైనవారే. అంటే సంవత్సరమేనట పెళ్ళై. ఇంత మంచి విషయం చెప్పినందుకు నాకు ఏమిస్తావ్?" మధ్యలో ఆపకుండా చెప్పేశాడు శ్రీమతికి ఆఫీసు నుంచి వస్తూనే.

వంట యింట్లోంచి స్వీట్, హాట్ ప్లేటుతో శ్రీమతి ముందుగదిలోకి వచ్చింది.

"అబ్బో నాకిష్టమైన స్వీట్ తయారు చేశావే. నీకేం కావాలో కోరుకో..." అన్నాడు తనేదో వరాల వరద స్వామి నైనట్లు ఫోజుపెట్టి.

"మహిళా మండలిలో మీటింగ్ ఉంది దానికి వెళ్ళనిస్తే చాలు" అని అంది శ్రీమతి నిదానంగా.

"వామ్మో! మీటింగే!" తింటున్నవాడల్లా ఆగిపోయాడు సుబ్బారావ్.

"ఇప్పుడే కదండీ నన్ను ఏమైనా కోరుకో మన్నారు. మళ్ళీ ఎందుకు అంత భయపడతారు."

"అహఁ అదికాదు నువ్వు ఈరోజే ఇల్లు చేరతావా!? అని అనుమానం వస్తేను."

"అదా మీ అనుమానం. మీటింగు 6 గంటల నుండి 8 గంటలదాకే. తరువాత వెంటనే వస్తాను."

"సరే నీ ఇష్టం. కాదంటే మాత్రం ఊరుకుంటావా...?"

"ఊరుకోక ఎగిరి గంతులేశానా. అయినా మీరు మాత్రం ఎప్పుడు ఊరుకొమ్మన్నారు. వెళతానంటే గొణిగే వారేగాని ఎన్నడన్నా గట్టిగా వద్దని చెప్పారా ?" అంది కోపంతో రుసరుస లాడుతూ.

"అసలే తలకాయ నొప్పిగా ఉంది" అన్నాడు సుబ్బారావ్ తలకాయ పట్టుకొని.

"అయ్యో. కాఫీ స్టౌమీద పెట్టి మరిచి పోయాను. తీసుకొస్తాను" అంటూ వంటింట్లోకి పరిగెత్తింది శ్రీమతి.

* * *



"ఏమండోయ్ ఈరోజు మన ఇంట్లో అద్దెకు ఉన్న ఎల్. ఐ. సి. ఆయనలేడూ, ఆయన ఇంటికి తాళం వేసి ఆఫీసుకి వెళ్ళాడు నిన్న సాయింకాలం ఆయన పెళ్ళాం కనిపించింది. ఇప్పుడు ఇంట్లో లేదా!? అని ఆశ్చర్యం వేసింది. తరువాత కాసేపటికి ఇంట్లో గిన్నెల చప్పుడయింది. ఏమిటా అని చూస్తే ఆయన పెళ్ళాం ఇంట్లోనే ఉంది."

"మా మహిళా మండలిలోకి క్రొత్తగా కాకినాడ నుంచి సుబ్బలక్ష్మి గారని ఒక ఆమె వచ్చింది. ఆమెకు మన ఇంట్లో వాళ్ళు తెలుసట కాకినాడలో ప్రక్కప్రక్క ఇళ్ళలోనే ఉన్నారట. ఆయనకి పెళ్ళాం మీద నమ్మకం లేదట. అందుకని ఇలా రోజు ఆమెను ఇంట్లోనే ఉంచి తాళం వేసి ఆఫీసుకెళతాడట. ఆమె చెప్పటం నేను చూడటం నిజమేననిపించింది." అన్నది సుబ్బారావ్‌కి కాఫీ ఇస్తూ.

"ఆమె మంచిది కాదేమో ...?" కాఫీ త్రాగుతూ అన్నాడు సుబ్బారావ్.

"ఆమె చాల మంచిదటండీ. నేను ఆ విషయం కూడ అడిగాను. అయినా పెళ్ళాన్ని నమ్మలేనివాడు పెళ్ళి ఎందుకు చేసుకోవాలి? ఆడదంటే అంత చులకనా మీ మగవాళ్ళకి. ఇలాంటి మగవాళ్ళ చేతుల్లో కీలుబొమ్మలైన ఆడవాళ్ళని రక్షించుకోవాలనే మా తాపత్రయం" అంది శ్రీమతి ఆవేశంతో.

"తాళంవేసి వెళతాడని చెప్పినంత మాత్రాన్నే నేను నమ్మను" అన్నాడు గట్టిగా తనకు శ్రీమతికి ఉన్న వాదనకు కట్టుకథ చెబుతుందనే అనుమానంతో.

"అయితే రేపు మీరు, ఆయన వెళ్ళేనరకూ ఉండి చూసి మరీ వెళ్ళండి ఆఫీసుకు" అంది కోపంగా.

"సరే అలాగే" అన్నాడు సుబ్బారావ్ శూన్యంలోకి చూస్తూ.

* * *

తొమ్మిది గంటల నుండే సుబ్బారావ్, శ్రీమతి కిటికీ ముందు కుర్చీలు వేసుకుని కూర్చున్నారు గదిలో. అక్కడ కూర్చుంటే ప్రక్కవాటా పంచ కనిపిస్తుంది.

తొమ్మిదిన్నరకల్లా అద్దెకున్నాయన తాళం వేయటం కనిపించింది వాకిలికి. శ్రీమతి నాకు చూపిస్తూ

"చూశారా ఆయన చేసేపని. నామాట మీద నమ్మకం లేకపోయింది మీకు"

నిజంగ అతను ఇంతపని చేస్తాడని ఊహించ లేదు. అలాంటి వాడని తెలిస్తే ఇల్లు ఇచ్చేవాడినే కాదు. మరి మనిషిని చూస్తే అలా లేడే. కానీ చూసిన తరువాత చాల బాధని పించింది సుబ్బారావ్‌కి.

శ్రీమతి ఏమేమిటో అడుగుతుంది. వాటికేమీ జవాబు ఇవ్వకుండా బయట పడ్డాడు సుబ్బారావ్. ఆఫీసులో పనిచేస్తున్నా సుబ్బారావ్ మనసు మాత్రం బాధతో కుమిలి పోతుంది. ఛీఁ ఛీఁ ఇలాంటి మనుషులను చూడకూడదు. వెధవ...భార్య మీదే అంత అనుమానమా ? మనసు మనసులో లేదు సుబ్బారావ్‌కి.

తలకాయ నొప్పి వచ్చింది సుబ్బారావ్‌కి — మధ్యాహ్నం ఆఫీసుకి శలవు పెట్టి ఇంటికి వచ్చాడు.

"ఏమిటండీ అప్పుడే వచ్చారు" శ్రీమతి ప్రశ్న.

"తలకాయ నొప్పిగా ఉంటేను శలవు పెట్టి వచ్చాను." బట్టలు విప్పి స్టాండ్‌పై వేసి లుంగీ కట్టుకొని మంచంమీద పడుకుంటూ సుబ్బారావ్ యిచ్చిన సమాధానం.

అమృతాంజనంతో వచ్చింది శ్రీమతి.

కళ్ళు మూసుకున్న సుబ్బారావ్‌కి అవే ఆలోచనలు.

అమృతాంజనం చేయి తగిలేసరికి కళ్ళు తెరిచాడు సుబ్బారావ్.

"శ్రీమతిగారు కష్టపడుతున్నారు."

"కష్టమేముందండీ? మొగుడికి సేవ చేస్తున్నాను."

"అయినా అమృతాంజనంతో పోయే తలనొప్పి కాదు నాది."

"ఓహో అదా సంగతి! అయితే నిమిషంలో వచ్చేస్తాను" అంటూ వంటింట్లోకి పరుగుతీసింది శ్రీమతి.

కాలం ఎలాంటిది. మనిషిని మనిషి నమ్మనంతగా మారిపోయిందా!? పాపం ఆ అమ్మాయి జీవితం రాతిజీవితం అనుభవిస్తుంది. ఛీఁ ఇతను ఇలాంటివాడనుకోలేదు. ఇంటికొచ్చిన క్రొత్తలో బాగానే ఉన్నాడు. మంచివాడనుకున్నాను. కానీ... ఛీఁ...

ఆలోచించినకొద్ది తలనొప్పి ఎక్కువౌతుంది.

కళ్ళు మూసుకోబోతున్న సుబ్బారావుకి కాఫీతో శ్రీమతి ప్రత్యక్షం ఐంది.

కాఫీ ఇచ్చి మళ్ళీ వంటింట్లోకి వెళ్ళింది శ్రీమతి.

కాఫీ త్రాగి గ్లాసు ప్రక్కన పెడుతున్న సుబ్బారావ్‌కి రెండొవ వాటాలోంచి ఏవో మాటలు వినబడుతున్నాయి. గొడవగొడవగా ఉంది. ఇంట్లో ఆడ గొంతు గొంతు చించుకుంటోంది.

ఆ మాటలనే ఆలకిస్తూ పడుకున్నాడు సుబ్బారావ్.

"పది రూపాయిలు తగ్గాయి ఏం చేశారు."

"ఏదో ఫ్రెండ్స్ పార్టీ అడిగితే ఇచ్చాను" నసిగింది మగగొంతు.

"ఇలా పార్టీలిస్తే ఇంట్లో గడ్డి తినాల్సి వస్తుంది" గట్టిగా అంది ఆడగొంతు.

పైవారమే!

కొత్త సీరియల్

"కోటిగాడు"

ప్రారంభం!

''ఈ ఒక్కసారే గదే'' నసిగింది మగగొంతు.

''ఒక్కసారే గదా అని ఊరుకుంటే అమ్మో! ఇంకేమన్నా ఉందా! మీరు తెగించరూ!?''

''అయినా మీరు పది రూపాయలు ఖర్చు చేశారు కాబట్టి మీకు పది రోజులు టిఫిన్ లేదు. అర్థమైందా? గుర్తుపెట్టుకోండి. ఈ రోజు నుంచి పది రోజులు.''

''.........''

అరె ఇటు ప్రక్క అద్దెకున్న గోపాలం వాళ్ళ వ్యవహారం ఎల్. ఐ. సి. రామారావ్ వాళ్ళకి విరుద్ధంగా ఉందే

''ఈ ఉదాహరణే తను ఎప్పుడూ శ్రీమతికి చెబుతుంటాడు. శ్రీమతి ఈ మాటలు విని ఉండదు...''

''శ్రీమతీ...శ్రీమతీ...''

''ఆఁ వస్తున్నా''

''త్వరగా రావాం''

''ఏమిటండీ ఏమైంది'' అడిగింది ఆదుర్దాతో శ్రీమతి.

''ముందు కూర్చో అంటూ శ్రీమతి చెయ్యి పట్టి లాగాడు సుబ్బారావ్. శ్రీమతి మంచం మీద కూలబడ్డది.

''మౌనంగా ఉండి గోపాలంగారి వాటాలోంచి వచ్చే మాటలు విను'' అన్నాడు చిన్నగా.

''ఏమేవ్. నా ఖర్చులకి డబ్బివ్వవే. జీతం అంతా నీకే ఇచ్చాను గదే!''

''ఇస్తే!? ఏమిటి మీ ఖర్చు. అన్నం ఇంట్లోనే తింటున్నారు గదా! టిఫిన్ ఇంట్లోనే గదా! కాఫీలు ఇంట్లోనే! సినిమాలు ఇద్దరం కలిసే వెళతాము. ఇహ మీకు ప్రత్యేక ఖర్చు ఏముంది!?'' అన్నది గట్టిగా ఆడగొంతు.

''ఏమేవ్ అన్యాయమే...''

''అరవకండీ గట్టిగా. ఇంకోసారి ఇలా చేసారంటే ఏమీలేదు ఇదిగో 10 పైసలు. తీసికొని పోండి గొడవ చేయక.''

''విన్నావా ఆ మాటలు.''

''విన్నాను'' అంది తలకాయ వంచుకొని.

''అమ్మయ్య నేనిచ్చే ఉదాహరణ ఎక్కడైనా చూపిచ్చమన్నావుగా. చాలా ఇంకా కావాలా?''

''అక్కర్లేదండీ. వాళ్ళ సంగతి, వాళ్ళు మన వాటాలోకి వచ్చినప్పటి నుంచీ తెలును.''

''అమ్మ దొంగా! నాకే అన్యాయం చేద్దామనుకున్నావా?''

''లేదండీ. ఇన్నాళ్ళూ మగవాళ్ళే అలాంటివారని అనుకొని మీతో వాదించాను. కాని ఆడవాళ్ళలో కూడా ఘనులు ఉంటారని మీరు చెప్పినా గ్రహించలేక పోయాను. కాని వీళ్ళు మన వాటాలోకి వచ్చిన దగ్గరి నుంచి మీ మాట నమ్మాను. కానీ ఆ విషయం మీతో చెప్పాలంటే భయం వేసింది. మొండిగా మీతో వాదించిన నేనే వీళ్ళ విషయాన్ని మీకు చెబితే నన్ను హేళన చేస్తారని చెప్పలేదు'' అంది ఏడుపు ముఖంతో సుబ్బారావ్ గుండెల మీదికి వాలుతూ.

''పిచ్చిదానా! అంతమాత్రానికేనా'' అన్నాడు శ్రీమతిని దగ్గరకు తీసుకుంటూ సుబ్బారావ్.

## ఇది విన్నారా?

★ ''అంగడి బొమ్మ'' చిత్రాన్ని మళయాళంలో డైరెక్ట్ చేసిన ఐ. వి. శశి తొలుదొల్త పదవీ స్వీకారం చేసిన చిత్రం పేరు ''సీమ''. కాని ఆ చిత్రం శ్రీకారంతో నిల్చిపోయింది. ''అవళోడరావుగల్'' (అంగడి బొమ్మ మళయాళం) చిత్రంలో తను పరిచయం చేసిన ''శాంతి'' అనే డాన్సర్‌కు ''సీమ'' అని పేరుపెట్టి, ఆ చిత్రాన్ని పూర్తిచేశారు ఐ. వి. శశి. నేడు ''సీమ'' బిజీస్టార్. ''సీమ'' చిత్రమైతే ఆగిపోయింది కానీ, ''సీమ'' పేరుతో పరిశ్రమకు పరిచయమైన ఫీమేల్ ఫేస్ మాత్రం పాప్యులర్ అయింది. ఒక సినిమాకు అచ్చిరాని పేరు ఒక సినీస్టార్‌కు కలిసివచ్చిందంటే, అది రాశిఫలమా లేక రాతఫలమా?

★ హిందీ నటుడు జితేంద్ర కొన్ని సంవత్సరాలుగా ఒక పాత ఇంపాలా కార్నే వాడుతున్నాడట. కారణం ఏమిటని విచారిస్తే ''అచ్చొచ్చిన కారు'' అంటాడట జితేంద్ర. పిల్లి శకునం చూడడంకూడా జితేంద్ర సెంటిమెంట్స్‌లో ఒకటట దైవభక్తి కూడా ఎక్కువే జితేంద్రకు.

★ రజనీకాంత్ ఇంతవరకు పర్సనల్ మేకప్‌మాన్‌ను పెట్టుకోలేదట. ఎలాంటి వేషమైనా తానే మేకప్ చేసుకుంటాడట. ఎందుకనడిగితే నేను ఫిలింఛేంబర్ ఇన్‌స్టిట్యూట్‌లో చదివాను అక్కడ మేకప్‌కు సంబంధించిన విషయాలుకూడా నేర్చుకున్నాను అంటాడట. ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో యాక్టింగ్ మాత్రమే నేర్పుతారని అక్కడ చదివిన చాలామంది చెప్తుంటారు. మరి రజనీకాంత్ మేకప్ గూర్చి కూడా నేర్చుకున్నాను అంటున్నాడే. ఇదోరకమైన పబ్లిసిటీ స్టంటా?

★ గాయని యల్. ఆర్. ఈశ్వరి జెమినీలో పాట పాడాల్సివస్తే కూడా ఒక ఫ్లాస్క్‌లో వేన్నీళ్ళు తెచ్చుకుంటుంది. ఎందుకనడిగితే జెమినీ ఏర్‌కండిషన్డ్ థియేటర్ కావడంతో పాట పాడేపుడు గొంతు ఆరిపోతూంటుంది. మధ్య మధ్యలో గొంతును వెచ్చచేయడానికి ఆ వేన్నీళ్ళు అంటుంది. మరి మిగతా సింగర్స్ కూడా ఈ ఆచారాన్ని పాటిస్తారా?

— శ్రీనివాస్



నిర్దేశత:
దుర్గానాగేశ్వరరావు
లక్ష్మి ఫిలింస్ విడుదల